# బుజ్జి

రాయచోటి శ్రీనివాసరావు

నవ్వులొలికిస్తూ! తడబడి నడుస్తూ క్షణ క్షణమూ ఆనంద డోలికలో ఆడింప జేసేటి ముద్దులపట్టి ఒకడు లేకపోగా రామారావు, లీలా దంపతులు బెంగుళూరునుండి ఒక ముద్దొచ్చే కుక్కపిల్లను తెచ్చుకున్నారు.

టామీ, టైగర్, జిమ్మీ, పప్పీ అల్లాంటి పేర్లేమీ తమ కుక్కపిల్లకు పెట్టలేదు. ముద్దుగా ఆ కుక్కపిల్లను 'బుజ్జి' అని పిలిచే వాళ్ళు. ఆ కుక్కపిల్లకూడా యెక్కడికీ పోకుండా అస్తమానమూ ఆ దంపతుల మధ్య ఆడుకుంటూ వుండిపోయేది.

రామారావు సాయంకాలం ఆఫీసునుండి యింటికి రాగానే ఒక గ్లాక్సో బిస్కట్టు తప్పకుండా తెచ్చి, వాకిటిలో నిలబడి "బుజ్జి" అని పిలచేసరికి, ఎక్కడున్నా సరే ఆ బుజ్జి పరిగెత్తుకుంటూ వచ్చి ముందరి కాళ్ళు రామారావు చేతుల కందించి, వెనుక కాళ్ళతో నిలబడి నోరు తెరచి చూస్తూ వుండేది రామారావు బిస్కట్టునో ప్లేవుం చుతూనే ఎగురుకుంటూ పోయి దాన్ని లీలావతమ్మకు చూపించేది. ఆమె నవ్వి దాని దేహం ఒకసారి నిమిరిన తర్వాత ఆ బిస్కట్టును తినేది.

"పూర్వ జన్మలో ఈ బుజ్జిగాడు మనవాడే అయివుంటాడే" అని అంటుండే వాడు రామారావు "లేకపోతే కుక్కపిల్లేమిటి, మనమీద యింత అనురాగం చూపడమేమిటి?" అని లీలావతమ్మ కూడా అనేది.

ఆ దంపతు లిద్దరికీ, తమకో పాపకావాలనే కోరిక నానాటికి తగ్గిపోయింది బుజ్జి మీద అనురాగం ఎక్కువయింది. ఆ కుక్కపిల్లనే తమ బిడ్డగా భావించుకుని క్షణక్షణం దాని బాగోగులు గురించి జాగ్రత్తగా చూచుకుంటుండేవారు.

ఇలాగా చాలా రోజులు గడిచాక, ఒక రోజు బుజ్జి పార్కుకు వెళ్ళి దీపాలు పెట్టే వేళకు యింటికి వచ్చింది, కానీ యిల్లు తాళం వేసింది పక్కింటబ్బాయి (అప్పుడప్పుడు బుజ్జితో ఆడుకునేవాడు) "బుజ్జీ! వాళ్ళు యిప్పుడే హాస్పిటల్ కు వెళ్ళారు." అన్నాడు. మనభాష దానికి అర్థమయిందో లేదో గానీ, అది మాత్రం, అక్కడి నుండి కదలి వెళ్ళిపోయింది.

తనకు తోచినదారి వెంబడి బుజ్జి పరుగెత్తింది. తన కెదురయిన ప్రతి సినిమాహాలు దగ్గరా ఆగి చూచింది. అలాగే వెళ్తూంటే తన దృష్టి ఒక జట్కాబండిని ఆకర్షించింది. ఒక్క పరుగులో ఆ జట్కాను అందుకుంది. అందులో రామారావు లీలావతమ్మ వెళ్ళుతున్నారు. జట్కాలో వున్న రామారావును ఎగిరి ఎగిరి అందుకోడానికి ప్రయాసపడింది బుజ్జి. కానీ రామారావు చిదరించుకొని "వెళ్ళు వెళ్ళు, యింటికెళ్ళు" అని బెదరించాడు.

ఎంతసేపటికి తమ్మురమ్మని చెప్పనందుకు బుజ్జి నిరాశగా తిరుగుముఖం పట్టింది.

ఇంటి వాకిటే విచారవదనంతో ఏదో ఆలోచిస్తూ పడుకుంది. ఎప్పటిలాగే పక్కింటి అబ్బాయి, బెండు తెచ్చి "ఆడుకుందాం రా" అని పిలచాడు. బుజ్జి కంతి కించలేదు. ఆ అబ్బాయి తన చేతిలోని బెండును దూరంగా విసరి "అదో అక్కడ— ఆ యింటిముందు బెండుంది. తే రెడీ... వన్...టు...త్రీ" అన్నాడు. బుజ్జి కదలేదు మెదల్లేదు. అల్లాగే విచారంగా పడుకుంది.

ఆ అబ్బాయి కోపంగా "తేవూ... తీసుకరావూ... సరే రేపు మానాన్న కాని యిచ్చినప్పుడు, నే నేదయినా కొనుక్కుంటా — అప్పుడు నీకేమైనా యిస్తానేమో చూడు," అని కోపంగా వెళ్ళబోయేసరికి, ఆ బుజ్జి తిన్నగా లేచి బాధగా నడుస్తూ పోయి ఆ బెండు తెచ్చి ఆ అబ్బాయి ముందు జారవిడిచింది. తాను యథాప్రకారం ఇంటి గడపమీద పడుకుంది.


ఆ అబ్బాయి ఆ బెండు తీసుకొని బుజ్జీకి ఆడుకోడం యిష్టం లేదేమో నని వెళ్ళి పోయాడు.


రాత్రి పది గంటలకుపైగా రామారావు మాత్రం యింటికొచ్చాడు బుజ్జి గడపమీదే మేలుకొని పడుకొంది. "బుజ్జి యిక్కడే వున్నావా, లే అమ్మలే," అని బుజ్జి అడ్డం తొలగినతరువాత రామారావు తాళం తీసి లోనికి వెళ్ళాడు. బుజ్జికూడా ఆయన వెంబడే ఆయన కాళ్ళకు రాచుకుంటూ నడచింది. దానికి యెక్కడలేని వుత్సాహం.

రామారావు ఒక పెట్టె తెరచాడు. బుజ్జి తన ముఖం ఆ పెట్టెలో పెట్టి గందరగోళం చేస్తుంటే, అందులోని పాత బిస్కట్టు ముక్క వొకటి దూరంగా విసిరి "అది తీసుకోపో" అని అన్నాడు కాని బుజ్జి బిస్కట్టు ముక్క కోసం గెంతలేదు. అక్కడే నిలుచుంది. రామారావుగారు కొంత డబ్బు తీసుకొని ఆ పెట్టె మూసేశాడు రామారావుతో బాటు బుజ్జీకూడా వెలుపలికి వచ్చి; అతను తాళం వేసేంతవఱకు అక్కడేవుండి, రామారావును ఎంతో పంతో వెంబడించింది. రామారావు కసరి కొట్టాడు. "వెళ్ళి-వెళ్ళి-అక్కడికి నిన్ను రానివ్వరు" అని, చరచరా వెళ్ళిపోయాడు.

ఏ మనుగాలనుకుందో; ఏం చెప్పాలనుకుందో ఆ నోరులేని బుజ్జి! ఏం చెయ్యలేక కళ్ళనీరు కారుస్తూ నిలబడిపోయింది. తన దక్కడిక చూట్లాడిచ్చేవా రెవరూ లేరు. పాపం! బుజ్జి కుమిలిపోయింది. నిద్రాహారాలు మానివేసింది. రెండు రోజులుపాటు ప్రక్కనున్న పార్కులో గడిపింది.

ఆనాడు నీరసంగా యింట్లో ప్రవేశించింది బుజ్జి మధురమనోహర గానం బుజ్జి చెవుల కందింది. ఏనాడూ వినరాని యీపాట ఎక్కడా అని ఆలోచించింది. ఆ అమృత గానం వినవచ్చే చోటికి మెల్లగా పోయింది. మేడమెట్లు ఎక్కింది. లీలావతమ్మ వుయ్యాలలోని బిడ్డను జోకొట్టి జోలపాట పాడుతూంది బుజ్జి సంతోషానికి మేర లేదు. గబగబ





మైసూరు రాజభవనం

ఫొటో: టి. వాసుదేవన్, మద్రాసు.

ఉయ్యాలదగ్గరికెళ్ళి బిడ్డను నాకడానికి తన ముందరి కాళ్లు ఉయ్యాలమీదికి వుంచింది. అంతలో రామారావు అక్కడికొచ్చి "ఛీ! వెధవ ముఖమా...పాపనుకొరుకుతావా...పో" అని బుజ్జి వెనక కాళ్లు పట్టుకొని జరజర లాక్కొచ్చి మేడమెట్లనుంచి క్రిందకు విసిరి పారేశాడు. పాపం! బుజ్జి ముందే నిద్రాహారాలు మాని నీరసంగా వుంటే పైపెచ్చు దెబ్బలు తగిలి రక్తం ప్రవహిస్తోంది. రామారావు లక్ష్యం చెయ్యక వెళ్ళిపోయాడు. బుజ్జి పాపం ఆరక్తసిక్తమైన శరీరంతో దోగుకుంటూ బయటికి అరుగుమీదకు వచ్చి పరుండిపోయింది.

తనంటే ప్రాణసమానంగా చూచుకొంటూ, ప్రతి సెకనూ తన్ను లాలిస్తూ, చంకన వేసుకొని ఎగుర వేసుకుంటూ, ప్రక్కన పరుండబెట్టుకుంటూ వుండేవారు లీలా దంపతులు. ఇప్పుడు తను వాళ్ళకు చీడపురుగులా అయిపోయింది. ఒకప్పుడు లీలావతమ్మ వుయ్యాలలో తన్ను పరుండబెట్టి జోకొట్టేది... రామారావు తన్ను ఎత్తుకొని ముద్దెట్టుకొని, ఆఫీసుకు తీసుకెళ్ళేవాడు. ఇప్పుడా ముద్దులు ముద్దులు అంతా దూరమైపోయింది బుజ్జికి. పాపం! బుజ్జి ఏడ్వని నిముషమంటూ లేదు. రోజు రోజుకు కుమిలి కుమిలి కృశించి పోతూంది. అందంగా చందమామ వన్నెలా నల్లగా వుండే బుజ్జి నలుపు తిరిగి అంద విహీన అయిపోయింది.

ఆరుమాసాలు గడిచాయ్. ఆరోజు లీలా రామారావులు ఏదో అవసరమైన పనిమీద బజారు వెళ్ళారు. బహుశ పాపకు బట్టలు తేనుంటుంది. ఎప్పుడు ఎక్కడ పోయినా బుజ్జికి చెప్పి ఇల్లును జాగ్రత్తగా చూచుకోమని వెళ్లేవారు. ఈసారి యింటికి తాళం వేసి వెళ్ళిపోయారు...ఆతాళం చూచి బుజ్జి కుమిలిపోయింది.

కొన్ని గంటల తర్వాత లీలా రామారావులు యింటికి వచ్చారు. తాళం తీసి లోనికి ప్రవేశించారు. అంతలో ఎదురుగా మేడమెట్లు దిగివస్తున్న బుజ్జిని చూచి రామారావుకు మండిపోయింది. బుజ్జి నోటిలో పాపవుంది. ఈ దృశ్యం చూచి గట్టిగా ఏడ్చింది లీలావతమ్మ... రామారావు వెంటనే ఒకపెద్ద బెత్తం తీసుకొని బుజ్జిని చావమోదాడు. పాపను లీలావతమ్మ బుజ్జి నోటినుండి లాక్కొంది. ఆ దెబ్బలకు బుజ్జి నోటినుంచి రక్తం ఏకధారగా ప్రవహించింది.

ముందే కృశించిపోతున్న బుజ్జి ఆ దెబ్బలు తగిలి ప్రాణాలు విడిచింది. "పీడ తొలగింది" అని బెత్తం మూలపారేసి మేడమెట్లు ఎక్కి యిద్దరూ వెళ్లారు.

మేడమీదకి వెళ్ళంగానే యిద్దరూ ఆశ్చర్య చకితులయ్యారు. పాప పరుండే పూల వుయ్యాల మండిపోతూంది. అప్పుడే సగం కాలిపోయింది!...ఈ దృశ్యం చూచి రామారావు "బుజ్జీ" అంటూ గట్టిగా అరచి బుజ్జి చెంతకు పరుగెత్తాడు. బుజ్జి శరీరం రక్తంలో నాని ముద్దయింది. అలాగే బుజ్జిని తన తొడపై పరుండబెట్టి "బుజ్జీ... తెలీకుండా చేశాను...క్షమించు బుజ్జీ...యీ పాపిని క్షమించవూ...బుజ్జీ నీ వెంత మంచిదానవు. నా పాపకు ప్రాణదానం చేశావు... బుజ్జీ...మాట్లాడవు...పోనీ ఒక్కసారి... కళ్ళు తెరచి నావైపు చూడు బుజ్జీ!... చూడు!...బుజ్జీ!......బుజ్జీ!..."అంటూ బుజ్జి నెత్తుకొని బయట వెళ్లిపోయాడు రామారావు!... ★